

దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ వాహనాలను పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల

# స్వరాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం

- మంత్రి గంగుల కమలాకర్
- 30 మందికి ట్రైసైకిళ్ల పంపిణీ

కార్పొరేషన్, సెప్టెంబర్ 30: రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఏడీఐపీ పథకంలో భాగంగా దివ్యాంగులు, వయోవృద్ధులు సాధికారత శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టర్ డాక్టర్ గోపి, నగర మేయర్ సునీల్‌రావుతో కలిసి 30 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని అవయవాలు చక్కగా ఉండి, వక్ర బుద్ధి ఉన్నవారే నిజమైన దివ్యాంగులన్నారు. దైవ సమానులైన దివ్యాంగులను గత ప్రభుత్వాలు చులకనగా చూశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ దివ్యాంగులను అక్కున చేర్చుకున్నారని చెప్పారు. ఎక్కడా లేని విధంగా దేశ చరిత్రలోనే దివ్యాంగులకు ₹4016 పింఛన్లు ఇస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఎంపీపీ లక్ష్మయ్య, నాయకులు పిట్టల రవీందర్, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కష్టపడే వారికే పార్టీలో గుర్తింపు

- మంత్రి కొప్పుల ఈశ్వర్



మంత్రి ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మద్దులపల్లి మాజీ ఎంపీటీసీ సంజీవ్

పెగడపల్లి, సెప్టెంబర్ 30: పార్టీలో కష్టపడి పని చేసే వారికే మంచి అవకాశాలు లభిస్తాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఐక్యమత్యంతో బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మద్దులపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ అరికట్ల సంజీవ్ బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ గుర్రం అనూష-మల్లారెడ్డి నేతృత్వంలో మంత్రి ఈశ్వర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై అనేక మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పెగడపల్లి సహకార సంఘం చైర్మన్ వోరుగంటి రమణారావు, నాయకులు గుర్రం మల్లారెడ్డి, మాదారపు కరుణాకర్‌రావు, తోట మోహన్‌రెడ్డి, వెల్మ సత్యనారాయణరెడ్డి, వెల్మ అనంతరెడ్డి ఉన్నారు.

# కేసీఆర్ అంటేనే భరోసా

- మెడికల్ హబ్‌గా జగిత్యాల
- ఎమ్మెల్యే సంజయ్ కుమార్



నినదిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 30: కేసీఆర్ అంటే ప్రజలకు భరోసా, నమ్మకమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జగిత్యాల మెడికల్ హబ్‌గా మారిందన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్స్‌లో జగిత్యాల పట్టణ, అర్బన్, రూరల్, బీర్‌పూర్, సారంగాపూర్ మండలాలకు చెందిన 236 మందికి ₹69 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో ₹10 కోట్ల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామన్నారు. దాదాపు ₹కోటి విలువైన చెక్కులను జిల్లా కేంద్రంతోపాటు రాయికల్‌లో ఇస్తున్నామన్నారు. ₹500 కోట్లతో మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నాయన్నారు. డయాగ్నోస్టిక్ ఏర్పాటు ద్వారా 134 రకాల వ్యాధులకు ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. జగిత్యాల జిల్లా దవాఖానలో ₹కోటి 80 లక్షలతో సిటీస్కాన్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే రేడియాలజీ ల్యాబ్ సైతం అందుబాటులో ఉందన్నారు. గతంలో 100 పడకలు ఉన్న జగిత్యాల ప్రభుత్వ దవాఖాన నేడు 330 పడకల దవాఖానగా మారిందని, మొత్తంగా 650 పడకలు రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరు ప్రవీణ్, కరీంనగర్ సుడా చైర్మన్ జీవీఆర్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కేడీసీసీ జిల్లా మెంబర్ రాంచందర్‌రావు, సీనియర్ నాయకులు దావ సురేశ్, జడ్పీటీసీలు మనోహర్‌రెడ్డి, మహేశ్, పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, బాలముకుందం, జిల్లా రైతు బంధు సమితి సభ్యులు కొల్ముల రమణ, పాక్స్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, మల్లారెడ్డి, నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ సురేందర్, మాజీ జడ్పీటీసీ ముక్క శంకర్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు పాల్గొన్నారు.

# సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు

- ఉపాధ్యాయ వృత్తి అత్యంత కీలకమైనది
- అల్పాహారంపై మీ అభిప్రాయం చెప్పండి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



వెంకట్రావ్‌పల్లి వద్ద హోటల్‌లో టీ తాగుతూ ఉపాధ్యాయులతో ముచ్చటిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

బోయినపల్లి, సెప్టెంబర్ 30: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అత్యంత కీలకమైనదని, అంతేకాకుండా సమాజంలో గౌరవ ప్రదమైనదని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన అనంతరం కరీంనగర్ వెళ్తున్న సమయంలో స్థానిక యువకుల విజ్ఞప్తి మేరకు బోయినపల్లి మండలం వెంకట్రావ్‌పల్లి వద్ద హోటల్‌లో ఆగి టీ తాగారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో టీ తాగుతూ ముచ్చటించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారంపై మీ అభిప్రాయాలు చెప్పాలని ఉపాధ్యాయులను కోరగా.. వారు చాలా బాగుందని చెప్పారు. విద్యార్థులు ఉదయం పూట ఇంటి వద్ద ఏం తినకుండా వస్తున్నారని, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం ఇవ్వడం విద్యార్థుల మానసిక ధృడ సంకల్పానికి దోహదపడుతుందన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు. మండలానికి నాలుగైదు సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూపకల్పన చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, వైస్ ఎంపీపీ నాగయ్య, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కట్ట గోవర్ధన్, వెంకట్రావ్‌పల్లి సర్పంచ్ నందయ్య ఉన్నారు.

# కులవృత్తులకు పూర్వ వైభవం

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- రాజరాజేశ్వర జలాశయంలో చేప పిల్లల విడుదల



కొదురుపాక వద్ద జలాశయంలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

బోయినపల్లి, సెప్టెంబర్ 30: సీఎం కేసీఆర్ పాలనలో కుల వృత్తులకు పూర్వ వైభవం వచ్చిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం కొదురుపాక వద్ద శ్రీ రాజరాజేశ్వర జలాశయంలో 3 లక్షల చేప పిల్లలు, 9 లక్షల రొయ్య పిల్లలను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా అక్కడే మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమైక్య పాలనలో కులవృత్తులు ఆదరణ కోల్పోయి ముంబై, భీవండి, గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లారని వాపోయారు. కానీ సీఎం కేసీఆర్ పాలనలో అన్ని కులాల వారు స్థానికంగానే ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయల నిధులను మంజూరు చేసిందన్నారు. గీత కార్మికులకు గ్రామాల్లో తాటి, ఈత చెట్లను పెంచి ఇస్తుందన్నారు. మత్స్యకార్మికుల కోసం గ్రామాల్లో చెరువు, కుంటల్లో చేప పిల్లలను విడుదల చేస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా శ్రీ రాజరాజేశ్వర జలాశయంలో కూడా లక్షలాది చేప, రొయ్య పిల్లలను వేసిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ అధికారి శివ ప్రసాద్, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జిల్లా ఫిషరీస్ చైర్మన్ రాంచంద్రం, సెస్ డైరెక్టర్ సుధాకర్, ఆర్బీఎస్ మండల కన్వీనర్ లచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు కొండయ్య పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూడండి

- సంజయ్‌ను ఆశీర్వదించండి
- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- ఆసరా పింఛను గుర్తింపు కార్డుల పంపిణీ
- పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కల్వకుంట్ల



కోనరావుపేట ఆసరా పింఛను లబ్ధిదారుకు గుర్తింపు కార్డు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 30: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత, అంతకు ముందు జరిగిన అభివృద్ధిలో తేడాను గుర్తించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని, రాబోయే ఎన్నికల్లో తన కొడుకు డా. సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్‌తో అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజాసంక్షేమానికి చేపడుతున్న చర్యలు శూన్యమని విమర్శించారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు ఆసరా పింఛను గుర్తింపు కార్డులను బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ వ్యవసాయంతో పాటు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, ఆయా రంగాలను పటిష్టం చేశారని పేర్కొన్నారు. తెలంగాణలో ఆసరా పింఛను ₹2,016, దివ్యాంగులకు ₹4,016 చెల్లిస్తున్నామని, కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ₹500 మాత్రమే ఇస్తున్నారన్నారు. అనంతరం చౌలమద్ది, రామారావుపల్లె, కోనరావుపేట, కొండ్రికర్ల, పెద్దాపూర్‌లోని పలు కుల సంఘాల అభివృద్ధికి మంజూరైన ₹33 లక్షల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచులు నల్ల యమున, మ్యాకల అర్చన, గడ్డం లింగారెడ్డి, కోరెపు రవి, తిగుర్ల లక్ష్మి, కోరెపు శ్యామల, ఎంపీటీసీ పుల్ల చంద్రశేఖర్‌గౌడ్, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు అనిరెడ్డి మారుతి, సహకార సంఘం అధ్యక్షుడు తీగల లింగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజరెడ్డి పాల్గొన్నారు.



### కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

తెలంగాణకు సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష. దేశంలోని ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి మన రాష్ట్రంలో జరుగుతున్నది. ఎక్కడా లేనివిధంగా పథకాలు అమలవుతున్నాయి. సంక్షేమ పథకం అందని ఇల్లు లేదు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలి. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలి.

- డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి